అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

■ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హుడా భారతి కాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం/ఎల్బీనగర్, జనవరి 19: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ హుడా భారతి కాలనీలో పర్యటించారు. ఎస్ఎన్‌డీపీ కింద జరుగుతున్న డ్రైన్ పనులను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులకు కావాల్సిన స్థలం అక్కడ లేకపోవడంతో ప్రైవేటు స్థల యజమానిని ఒప్పించి కొంత స్థలం ఇచ్చేందుకు అంగీకారం తీసుకోవడం జరిగిందన్నారు. డ్రైన్‌ను 45 డిగ్రీల్లో తీసుకువెళ్లేందుకు సాధ్యం కావడం లేదని, 90 డిగ్రీల్లో తీసుకువెళ్లాలని అధికారులు తెలిపారు. 90 డిగ్రీలతో వెళ్లే చాలా సమస్యలు ఉత్పన్నమవుతాయని, 45డిగ్రీల కోణంలోనే పూర్తి చేయాలని సూచించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అందోజు సత్యంచారి, శ్రీనివాస్ నాయక్, శివారెడ్డి, సయ్యద్, నాగిరెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులాల్లో దరఖాస్తుల ఆహ్వానం

మాదన్నపేట, జనవరి 19: మాదన్నపేట ధోబీఘాట్‌లోని సనత్‌నగర్ బాయ్స్-1 గురుకుల పాఠశాల, కళాశాలలో (2024-2025) విద్యా సంవత్సరానికి దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ డా.అరుంధతి ఓ ప్రకటనలో కోరారు. 5 నుంచి 8వ తరగతి ప్రవేశానికి 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

అడ్మిషన్లు ప్రారంభం

సైదాబాద్, జనవరి 19: మైనార్టీ గురుకుల పాఠశాల (సైదాబాద్)లో అడ్మిషన్లను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 30మంది మైనార్టీ సీట్లు, 10 నాన్ మైనార్టీ సీట్లతోపాటు 6,7,8వ తరగతుల్లో ఒక్కొక్క మైనార్టీ సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బీఆర్ఏఓయూ పరీక్ష ఫీజు గడువు పెంపు

హయత్‌నగర్, జనవరి 19: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ-3, 5 సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువును జనవరి 23 వరకు పొడిగించినట్లు హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం ట్యూషన్ ఫీజు ఈనెల 23 లోపు చెల్లించిన వారికే పరీక్ష ఫీజు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశముందన్నారు. విద్యార్థులు ఫీజులను ఆన్‌లైన్‌లో చెల్లించాలని, వివరాల కోసం 73829 29771 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కందుకూరులో మాట్లాడుతున్న యాదగిరి

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

కందుకూరు, జనవరి 19 : పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలని ఎంఆర్‌పీఎస్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోర్ కమిటీ సభ్యుడు చిన్నగాల్ల యాదగిరి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టకుండా కాలయాపన చేస్తుందని వివరించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి వచ్చే నెలలో నిర్వహించే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టే విధంగా కృషి చేయాలని కోరారు. అనంతరం ఈ సందర్భంగా నియోజకవర్గం అధ్యక్షుడిగా వడ్డెమోని రాజు, మండల అధ్యక్షుడిగా రాంచంద్రి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బర్ల యాదయ్యను ఎన్నుకున్నామని తెలిపారు.

సమాజ సేవకు కృషి చేయాలి

కందుకూరు, జనవరి 19 : సమాజ సేవకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్ తెలిపారు. నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ సంస్థ సేవా పురస్కారం-2024కు అన్నోజిగూడ గ్రామానికి చెందిన కాకి సదానంద స్వామిని ఎంపిక చేయడంతో పాటు వివేకానంద జయంతి ముగింపు సందర్భంగా శుక్రవారం నగరంలోని సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో సదానంద స్వామిని సన్మానించారు. అవార్డు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బండ ప్రకాశ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని సన్మానించడం సంతోషకరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారిని ఆదుకున్నట్లు గుర్తు చేశారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, మాజీ మంత్రి, సినీ నటుడు బాబుమోహన్, ఫౌండేషన్ చైర్మన్ బత్తుల హేమంత్, డాక్టర్ రాజ్‌నారాయన్ ముదిరాజ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

సందానంద స్వామికి అవార్డును అందజేస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు సన్మానం

ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను సన్మానిస్తున్న రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అందుగల సత్యనారాయణ, సభావత్ నరేందర్ నాయక్, మదన్‌పాల్ రెడ్డి, యాదయ్య, రాజు తదితరులు.

– కందుకూరు. జనవరి 19

నిధులు మంజూరు చేయాలి

సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్త కాలనీలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణ శుక్రవారం జలమండలి సీజీఎం నాగేంద్రకుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అదే విధంగా కరణ్‌బాగ్ కాలనీ, ఎస్బీహెచ్ బ్యాంక్ కాలనీలకు మినీ ఎయిర్‌టెక్ వాహనం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం ఖదీర్ మొహినుద్దీన్, సైదాబాద్, ఆస్మాన్‌ఘడ్ డివిజన్ల జలమండలి మేనేజర్లు శ్రావణ్‌కుమార్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

–సైదాబాద్, జనవరి 19:

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తాం

కందుకూరు, జనవరి 19 : రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తాసీల్దార్ గోపాల్ తెలిపారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ల సమావేశంలో తాసీల్దార్ పాల్గొని మాట్లాడుతూ.. బోగస్ డీలర్లు ఉంటే వెంటనే తప్పుకోవాలని.. డీలర్ కుటుంబ సభ్యులు మాత్రమే బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. బియ్యంతో పాటు ఇతర వస్తువులను విక్రయించడానికి డీఎస్‌వో నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో గోదాంను ఏర్పాటు చేయాలన్న డీలర్ల వినతిని పరిశీస్తామని చెప్పారు. లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలని.. సమయపాలన పాటించాలని.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయబ్ తాసీల్దార్ తాజుద్దీన్, ఆర్ఐలు ప్రేమ్ కుమార్, శ్రీకాంత్, రెవన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాల్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 19: మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డీఈఈ హనుమంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఏడు దేవాలయా లు ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు, 11కేవీ అజంపురా ఫీడ ర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యా హ్నం 1 గంట వరకు, 11కేవీ డబీర్‌పురా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 11కేవీ రోషన్ డెయిరీ ఫాం ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు వి ద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు

తట్టిఅన్నారం ఫీడర్ పరిధిలో..

ఆర్కేపురం, జనవరి 19 : చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అంతరాయం ఏర్పడుతుందని సరూర్‌నగర్ విద్యుత్‌శాఖ డీఈ కేకే రామకృష్ణ తెలిపారు. తట్టిఅన్నారం ఫీడర్ పరిధిలో తట్టిఅన్నారం, ఆర్కేనగర్, వనస్థలిహిల్స్, కుత్బుల్లాపూర్, తిమ్మాగూడ, మర్రిపల్లి పరిసర ప్రాంతాలు. లక్ష్మిగణపతి ఫీడర్ పరిధిలో జె.కన్వెన్షన్ హాల్, లక్ష్మిగణపతి కాలనీ పరిసర ప్రాంతాలు. ఇందు అరణ్య అపార్ట్‌మెంట్స్ ఫీడర్ పరిధిలో ఇందు అరణ్య అపార్ట్‌మెంట్స్, విల్లాస్ పరిసర ప్రాంతాలు. ఇందు అరణ్య హౌసింగ్ ఫీడర్ పరిధిలో ఇందు అరణ్య హౌసింగ్ పరిసర ప్రాంతాలు. టీఎస్. హౌసింగ్ బోర్డు ఫీడర్ పరిధిలో ఇందు అరణ్య అపార్ట్‌మెంట్స్, ఇందు అరణ్య విల్లాస్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎల్బీనగర్ ఆక్సిజన్ పార్కు సమీపంలో ఓపెన్ ప్లాట్‌లో వ్యర్థాలను కాల్చుతున్న దృశ్యం

తరలించలేక.. తగలబెడుతున్నారు!

- డంపింగ్ యార్డుల్లా ఖాళీ స్థలాలు
- వీధుల్లో పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- పొగతో నిండిపోతున్న రహదారులు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు

ఎల్బీనగర్, జనవరి 19: ఎల్బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో వ్యర్థాలను డంపింగ్‌యార్డులకు తరలించాల్సి ఉండగా అందుకు భిన్నంగా ఎక్కడికక్కడే కాల్చేస్తున్నారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగంగా చెత్తను డపింగ్ యార్డులకు తరలించాలని, వ్యర్థాలను సైతం డంపింగ్ యార్డులకు తరలించాలని అధికారులు చెబుతున్నా అందుకు భిన్నంగా సర్కిళ్ల వారీగా కాల్చివేతలు కొనసాగుతున్నాయి. ఎల్బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలోని ఖాళీ ప్లాట్లలో చెత్తను వేయడంతో పాటు అక్కడ పోగు చేసి కాల్చివేస్తున్నారు. ఇలా మూడు సర్కిళ్ల పరిధిలో పలు ప్రాంతాల్లో చెత్తను, వ్యర్థాలను యథేచ్ఛగా కాల్చివేస్తున్నా సంబంధిత అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. పార్కుల సమీపంలోనూ చెత్తను కాల్చివేస్తూ పర్యావరణ పరిరక్షణకూ తూట్లు పొడుస్తున్నారు. ఎల్బీనగర్ కామినేని ఫ్లై ఓవర్ కింద ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఆక్సిజన్ పార్కు సమీపంలోని ఓ ఓపెన్ ప్లాట్‌లో వ్యర్థాలను పోగుచేసి కాల్చేస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదే విధంగా హయత్‌నగర్ నుంచి మునుగనూర్ వెళ్లే దారిలో చెరువుకు మరోవైపు ఉన్న ఓపెన్ ప్లాట్లలోనూ నిత్యం వ్యర్థాలను కాల్చివేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా శ్రావణ్‌కుమార్

సైదాబాద్, జనవరి 19: జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడిగా చంచల్‌గూడకు చెందిన ఎం.శ్రావణ్‌కుమార్‌ను నియమిస్తూ శుక్రవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈస్ట్‌జోన్ ఎంవీఐలు రమేశ్‌బాబు, అరుణ

మలక్‌పేట, జనవరి 19: ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఈస్ట్ జోన్ ఎంవీఐ రమేశ్‌బాబు తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఈస్ట్‌జోన్ ఆర్టీఓ కార్యాలయంలో ఆర్టీఓ సుభాష్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో వాహనదారులు, దరఖాస్తుదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రమేశ్‌బాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని.. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి.. సిగ్నల్ జంప్, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ఫిట్‌నెస్‌లేని వాహనాలు రోడ్లపై తిప్పితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈస్ట్‌జోన్ ఆర్టీవో సుభాష్‌చంద్రారెడ్డి, ఏఓలు విజ య్ కుమార్, ప్రవీణ్‌కుమార్, మధుకర్, ఎం వీఐ అరుణ, సిబది గిరిబాబు, మహ్మద్ గౌస్, సుజాతాదేవి, ఎం. శైలజ, విమలాకుమారి, శైలజ, బేగ్, శ్రీకాంత్, వినయ్, అరుణ, విజయ పాల్గొన్నారు.

చాక్లెట్లు పంచి అవగాహన

నల్గొండ చౌరస్తాలో రోడ్డు సేఫ్టీ నియమాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించని వాహనదారులకు చాక్లెట్లు పంచి మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐలు రాము, యాదయ్య, రామస్వామి అవగాహన కల్పించారు.

అభివృద్ధి వైపు నడిపించేది వ్యవసాయమే..

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీచైతన్య స్కూల్ ఉపాధ్యాయులు

హయత్‌నగర్, జనవరి 19: దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించేది వ్యవసాయరంగమే అని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ అంజనీదేవి అన్నారు. హయత్‌నగర్ బ్రాంచి(సాయినగర్) శ్రీచైతన్య స్కూల్‌లో శుక్రవారం ''జై జవాన్..జైకిసాన్'' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులను వ్యవసాయ క్షేత్రాలకు తీసుకువెళ్లి అక్కడి రైతులతో ముచ్చటించారు. వ్యవసాయ పద్ధతులు, దిగుబడి, రాబడి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల పంటల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ పనిముట్లను చూపించారు. కార్యక్రమంలో ఏజీఎం సతీశ్, జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ జితేందర్, పాఠశాల డీన్ రఘుపతి, ఆర్ఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి

కందుకూరు, జనవరి 19 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి తెలిపారు. శుక్రవారం పాషా నరహరి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 16 నుంచి సీఐటీ యూ, రైతు సంఘం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న కర్షక వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

■ అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్

బడంగ్‌పేట, జనవరి 19: అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. శుక్రవారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్‌పై శాఖల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయ వనరులపై చర్చించారు. ప్రస్తుతం వస్తున్న ఆదాయం.. ఖర్చుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. అక్రమ కట్టడాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్పొరేషన్ పరిధిలో ఇప్పటివరకు ఎన్ని అక్రమ నిర్మాణాలు గుర్తించారు.. ఎంత మంది భవన యజమానులకు నోటీసులు ఇచ్చారు.. ఎన్ని కూల్చేశారని టౌన్‌ప్లానింగ్ అధికారులను ప్రశ్నించారు. అనధికారిక భవనాలకు నోటీసులు ఇచ్చి కూల్చివేతల్లో జాప్యం ఎందుకు జరుగుతుందని అడిగారు. అక్రమ నిర్మాణదారులు ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే.. కోర్టు వివాదాలు ముగిసిన వెంటనే చర్యలు తీసుకోవాలని.. టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించారు. హోర్డింగ్‌లు, ప్రకటనలకు సంబంధించిన బోర్డులు ఎన్ని ఉన్నాయని.. వాటితో ఎంత ఆదాయం వస్తుందని తెలుసుకున్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కమిషనర్ సుమన్ రావు, డీఈ యాదయ్య, ఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

మట్టమ్మ(ఫైల్)

హయత్‌నగర్, జనవరి 19: వృద్ధురాలు అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ మండలం, ఉషోదయ కాలనీకి చెందిన చలికంటి మట్టమ్మ, ఇంటి నుంచి వెళ్లి సాయంత్రానికి తిరిగి రాలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికపై అవగాహన

బడంగ్‌పేట, జనవరి 19: పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని మండల విద్యాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలంలో 38 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సరూర్‌నగర్‌లో 40 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మహేశ్వరం మండలంలో 56 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికపై బాలాపూర్ చౌరస్తాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎన్నికలు నిర్వహించడానికి సమావేశం ఏర్పాటు చేసిన్నట్లు తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎలా ఎన్నుకోవాలన్న అంశంపై ఎంఈవో వివరించారు. 20వ తేదీన విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానం అందజేయాలని.. 21న తల్లిదండ్రుల వివరాలు నోటీస్ బోర్డులో పెట్టాలని తెలిపారు. 22, 23తేదీల్లో తల్లిదండ్రుల అభ్యంతరాలు తీసుకోవాలన్నారు. 24తేదీన ఫైనల్ లిస్టు డిస్‌ప్లే చేయాలన్నారు. 29న తరగతుల వారీగా ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు నిర్వహించి 2గంటల తర్వాత నూతన కార్యవర్గం ఎన్నుకోవాలన్నారు. ప్రతి తరగతిలో ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలని తెలిపారు. అందులో ఇద్దరు మహిళలు తప్పని సరిగా ఉండే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యాధికారి డి.కృష్ణయ్య